


# అమ్మ సంసారం లెక్కలు

నిరుడంటే చిన్నారో బళ్లోనూ నేనో బళ్లోనూ చదవాల్సి రావడంతో చెడ్డ విసుగ్గా వుండేది. ఎంతైనా మహాతల్లి

సాధించిందిగా మా స్కూల్లోనే ఫస్టుఫారంలో సీటు. ఇందుని కూడా మా బళ్ళోనే చేర్చడంతో అందరం కార్లో బడికెళ్లడం రావడం. ఒక వేళ మా నాన్నకి మళ్లీ ట్రాన్స్ఫరై ఇంకో వూళ్లో ఇంకోరింట్లో అద్దెకుంటే వాళ్లకి కారు లేకపోతే చాలా కష్టం బాబూ ! అమ్మ చెప్పినట్లు నేర్పతరం గానీ మాన్పతరం కాదు కదా ఏదయినా. నాన్నకీ విషయం గట్టిగా చెప్పాలి మనిల్లు గల వాళ్లకి ఓ కారూ ఓ అమ్మాయీ వుండాలని ! అయినా అందరమ్మాయిలూ సువర్ణంత మంచిగా వుండాలని లేదనుకో !

మా అమ్మకూ్కడా అదేవిటో ఇంట్లో నలుగురాడ పిల్లలం కలకల్లాడిపోతున్నా సువర్ణే అందంగా కనిపిస్తుంది. పిల్లకి తగ్గ పేరు పెట్టారు వదినగారూ ! ఎంత చక్కదనాలో అని మురుస్తుంది. ఎప్పుడన్నా ఒక్కసారి బయటవాళ్లని మెచ్చుకుంటే భరించచ్చు గానీ ఒకటికి పది సార్లంటూంటే మాకు మాత్రం కష్టంగా వుండదూ ?

అమ్మా ! నువ్వు కూడా అత్తయ్యగారిలా అంత శ్రద్ధగా కచ్చూరాల నలుగు పిండితో నలుగులు పెట్టి తలంటోసి నెప్పెట్టకుండా నిమ్మళంగా చిక్కులు తీస్తూ పాయపాయకీ దువ్వుతూ బొటనవేలుతో అమరుస్తూ, దువ్వుతూ అమరుస్తూ జడలేస్తే మేవూ అంతే చక్కదనాల్లా వుంటాం అని అనాలనిపిస్తుంది కానీ, పోనీలే అమ్మనెందుకూ అలా అని చిన్నబుచ్చడం. అత్తయ్య గారికయితే పూజ చేసి పెట్టడానికి బామ్మగారూ, వంట చేసి పెట్టడానికి వెంకాయమ్మ గారూ, మిగతా అన్ని పనులూ చేసి పెట్టడానికి గుమస్తా తాతగారూ, ఇంత మందున్నారు ! పాపం అమ్మకయితే చేసేందుకు తానొక్కతి ! చేయించుకునేందుకు నాన్నతో కలిపి అయిదు గురం.

బావి దగ్గిర మెట్ల మీద కూచుని లెఖ్ఖలు చేసుకుంటున్నా : తలెత్తి చూస్తే పాలుపోసే బాలరాజు.

''ఇయ్యేల తప్పనిసరిగా లెఖ్ఖ చూత్తానన్నా రండమ్మగారు. ఓ పాలి పిలండి'' అన్నాడు.

''లెఖ్ఖేగా నాకు చెప్పు నే చూస్తాగా ! ఈపాటి దానికి అమ్మెందుకూ ?'' అన్నా. ఇంతట్లోకీ మా గొంతులు వినబడి అమ్మే బయటికి వచ్చింది చేతిలో ఇందు జడని పుచ్చుకుని, ''ఒఖ్ఖ నాత్రో జులాగమంటే ఇంతలా ఖంగారు పెట్టేస్తున్నావేంటి బాలరాజూ'' అంటూ.

''అవసరం పడ్డదమ్మా! లేకుంటే మిమ్మల్నిబ్బంది పెట్టేద్దునా ?'' అంటూ అక్కడే నిలబడ్డాడు.

''ఉ! కానీయ్ తప్పుతుందా ! కిందటి నెల ముప్పయి రోజులు కదా ! పొద్దున్న పూట శేరుంముప్పావు సాయంత్రం మూడు పావులు, రోజుకు రెండున్నర శేర్లు కదా ! అంటే ముప్పై

రెళ్లు అరవై, ముప్ఫై అర్ధలు పదిహేను. మొత్తం డెబ్భై అయిదు. నాలుగాది వారాలూ నాలుగు శేర్లెక్కువ. డెబ్భై తొమ్మిది. రెండు సాయంత్రాలు నాగా పెట్టావు, శేరున్నర తీసెయ్యి. అంటే డెబ్భై ఏడున్నర శేర్లు. అర్ధశేరుకే వొచ్చెలే. శేరు రూపాయి పావలా. డెబ్భై ఏడు రూపాయిలూ, అన్నే పావలాలూ అంటే ముప్ఫై ఎనిమిదిన్నర అర్ధలు. మరి అవి పందొమ్మింపావలా. మొత్తం తొంభయ్యారుంపావలా. పావలా తీసెయ్యి. క్రితంనెల ఇరవై అయిదు ఎక్కువచ్చాగా! ఇదిగో డెబ్భై ఒకటి'' అని దాని జడ నా చేతిలో పెట్టి డబ్బులిచ్చి ఇచ్చి మళ్లీ జడుచ్చుకుని లోపలి కెళ్లి పోయింది.

వాడు డబ్బులు లెఖ్కెట్టుకోకుండానే సంచీలో పడేసుకుని వెళ్లిపోయాడు. నేనా లెఖ్ఖంతా నోరు తెరుచుకుని వింటూ వుండిపోయా ! ఇంత కష్టమయిన నోటి లెఖ్ఖలెలా చేస్తుందబ్బా ! ఎంత ధైర్యవో ! తప్పు చేస్తే డబ్బులు పోవూ ?

ఇంతలోకీ మళ్లీ అమ్మ వచ్చి ''నానీ ! వెంకాయమ్మమ్మగార్ని ఓసారినే పిలుస్తున్నానని చెప్పిరా!''

''ఎందుకమ్మా ! ఏవన్నా డబ్బా టిఫిన్లు చేయిస్తావా ?'' అనడిగా. నోరు మూసుకుని చెప్పిన పని చెయ్యి అని కసిరింది. అలాగే నోరు మూసుకుని వెళ్లి సంజ్ఞలతోటే ఆవిడని లాక్కొచ్చాను. ఆవిడ నవ్వుకుంటూ నా వెనకాలే వచ్చారు ''ఏవిటీ సరోజమ్మా సంగతీ'' అంటూ.

''ఏం లేదూ ! ఈ మధ్య మాకు జీతాలాలీసవవడం, పిల్లలకీ బట్టలూ, ఫీజులూ వాటితో రెండ్నెల్ల నించీ పిన్నిగారి కద్దివ్వనే లేదు. ఆవిడతో మాట్లాడాలన్నా మొహమాటంగా వుంటోంది. ఎక్కడన్నా ఓ రెండొందలు చూసిపెడతారేమో ! మళ్లీనెల్లో మా బావగారెటూ పంట డబ్బు పంపిస్తారు. ఇలా అడిగానని ఎవరితో అనకండేం'' అని రహస్యంగా మాట్లాడింది.

''భలే దానివే ! అద్దివ్వడం కోసం అప్పు చేస్తావా పిచ్చిపిల్లా ! మీరిచ్చే అద్దె వాళ్ళకే పంటి కిందకీ ? ఏదో ఆ మధ్య సువర్ణ బెంగగా వుంటోందని ఆడుకునేందుకు తోడుగా వుంటారని పిల్లల్ని చూసి మీకిల్లిచ్చారు గానీ అసలు అద్దెలకివ్వడం వాళ్లకి అలవాటు లేదు. అవసరవూ లేదు. ఈ అద్దెకేం అర్జెంటు లేదు. పెద్దమ్మగారికి నేచెప్తాలే! నువ్వు మాత్రం తెలిసీ తెలియకా ఎక్కడా అప్పులు చెయ్యకు!'' అని వెళ్లిపోయారు.

అమ్మ ! ఇదా సంగతీ ! ఇంతకీ ఇక్కడ కూడా మా నలుగుర్నీ చూసే అద్దెకిచ్చారన్న మాట. అంటే మేం రాజకుమార్తెకి చెలికత్తెల్లా అన్నమాట. ఇన్నాళ్లూ ఇంత డబ్బున్న వాళ్లు ఇల్లెందు కిచ్చారో తెలిసేది కాదు. అమ్మయ్య ! ఇప్పటికయినా తెలిసింది.

పాపం అమ్మని చూస్తేనే తోచట్లేదు. ఇంటద్దిస్తే పాలవాడికియ్య లేదూ ! వాడికిచ్చేస్తే అద్దియ్య లేదూ ! పోనీమని నేను కూడా అమ్మలానే ఆలోచించడం మొదలెట్టా ! పాలు తగ్గిస్తే పిల్లలు పాడయిపోతారూ ! నెయ్యి లేందే ఈయన ముద్దెత్తరు ! చదువులూ ఫీజులూ పుస్తకాలూ దేన్ని తగ్గిస్తాం ! దేశ మధ్యంలో వున్నాక చుట్టాలు తప్పరు కదా !

''ఇంక వుత్త ఆలోచనతో కుదరట్లేదని పెన్నూ కాయితం పెట్టి రాయడం మొదలెట్టాను. ఆలోచించగా రాయగా రాయగా చివరికి తేలింది. ఒక్క నాన్న కాల్చే సిగరెట్లొక్కటే మానేయ గలిగిన ఖర్చు. అవును. నాన్న అస్తమానం సిగరెట్లెందుకూ కాల్చడం ? అవి మానేస్తే రోజుకి రూపాయి చొప్పున నెలకి ముప్ఫై రూపాయిలు కలిసొస్తాయి. కానీ అమ్మో ! ఆ మాటంటేనే నాన్న చంపేస్తారు ! ఓసారలా అమ్మ అందని నీళ్ల గ్లాసు విసిరి కొట్టి వెళ్లిపోయి సాయంత్రం వరకూ ఇంటికి రానేలేదు ఆదివారం అయినా కూడా.

నాన్నొచ్చే వరకూ అమ్మ చుట్టూ తిరుగుతూ ఎన్నో రకాల వుపాయాలు చెప్పాను. ఎవరి పుట్టిన రోజయితే వాళ్లొక్కళ్లకే బట్టలు కుట్టిస్తే చాలూ అందరికీ కొనక్కర్లేదనీ, ప్రతాదివారం సినిమాలేం చూడక్కర్లేదూ ! నెలకోటి చూస్తే చాలనీ, ప్రతి రోజూ సాయంత్రం టిఫిన్లు చేసు కోకుండా దొడ్లో జామకాయలు తినచ్చనీ ఇలా... ఇంక తర్వాతేం తట్టలేదు.

భోయనాలయిపోయాక నాన్న పడక్కుర్చీలో సిగరెట్టు కాల్చుకుంటూ పేపరు చదువు కుంటూ౦ంటే అమ్మ చిలకలు చుట్టిస్తోంది. చుట్టిన్ది చుట్టినట్లే వుంది. ఎంతకీ నవలడం ఆపరే. అమ్మ నాన్నని ''మీరు మనిషా ! మేకా!'' అనే వరకూ తింటూనే వుంటారు. నేను పెన్నూ పేపరు పుచ్చుకుని నాన్న పక్కనే కూచున్నా.

''ఇప్పుడేం లెఖ్ఖలే బాబూ ! నా వల్ల కాదు. ఏదన్నా ట్యూషను పెట్టించుకోకూడదూ ?''

''నాన్నా ! మా స్కూలు ఫీజులు కట్టాక పాలవాడికిస్తే అద్దియ్యడం కుదరట్లా! అద్దిస్తే పాలవాడికియ్యడం కుదరట్లా ! పాపం అమ్మ బామ్మగారి మొఖం చూడ్డానికి మొహమాట పడుతోంది తెల్సా ! అయినా ఇప్పుడు మీరేం నాకు లెఖ్ఖలు చెప్పక్కర్లా''.

''నన్నేం చెయ్యమంటావే ? జీతం అంతా మీ అమ్మకే ఇస్తున్నాగా ! ఎక్కడన్నా కన్నం వేద్దాం. కోట ఏదన్నా వుందేమో చూడమను మీ అమ్మని'' అన్నారు.

''కన్నాలేం వెయ్యక్కర్లా! మనం కాస్త ఖర్చులు తగ్గించుకుంటే చాలు'' అన్నా !

''సరోజీ! దీనికిప్పట్నించీ ఇన్ని ఆరాలెందుకు ? పిల్లలు పిల్లల్లా ఎందుకుండరు?'' అని అమ్మని ఒక్కరుపరిచారు.

''ఎందుకంటే పిల్లలు ఎప్పటికీ పిల్లల్లానే వుండిపోరు కాబట్టి. దేవుడు వీళ్లకి కళ్లూ చెవులూ ముక్కూ బుర్రా అన్నీ తిన్నగా పెట్టాడు కాబట్టీ ! మనం చెప్పినా చెప్పకపోయినా అన్నీ

అవే తెలుస్తాయి. ఇంతకీ ఈవేళ నే చేసిన మహాపరాధమేవిటంటే ఇదక్కడే వుందని చూసుకోకుండా వెంకాయమ్మగారిని ఓ రెండొందలు సర్దమని అడగడం. అప్పట్నించీ ఆ వెధవ పెన్నూ, కాయితవూ పుచ్చుకుని నా ప్రాణాలు తీస్తోంది. కందిపప్పు మానేద్దామా, చింతపండు మానేద్దామా అంటూ'' అని హోల్‌మొత్తం నా మీదకే నెట్టేసింది అమ్మ.

''అన్ని లెఖ్ఖలూ చూసేశా నాన్నా. అమ్మేవీ ఎక్కువ వాడటల్లా. మీరే అనవసరంగా రోజుకి మూడు సిజర్సు పాకెట్లు కాల్చి నెలకి ముప్ఫై రూపాయలు తగలేస్తున్నారు. మనకి నెల కూరల ఖర్చు ఇరవై ఎనిమిదే వచ్చింది తెల్సా'' అని చెప్పేశాను, నాకేం భయం !

''అబ్బబ్బబ్బ ! ఇంక తల్లీకూతురూ ఒకటయి పోయాక నేనేం చేయగలను. పెద్ద నాన్న గారు డబ్బు పంపిస్తే మూడ్నెల్లిబ్బందుండదు ! ఆ తర్వాత మనం బెజవాడ బారేజీ కట్టడానికి వెడతాం కదా ! ఈసార్నించీ ప్రాజెక్టులలవెన్సని రెండొందలెక్కువిస్తార్ట. ఎంచక్కా బోల్డు సిగరెట్లు కాల్చుకోవచ్చు ! ఇంక నన్నొదిలెయ్ నానీ!''

''ఈ మాటనే మనిషికేమన్నా మతుందా ! బెజవాడ కాపరమంటే ఫ్లాట్‌ఫారమ్మీదున్నట్లే కదా ! అమ్మో అసలే అన్నీ వూరు పట్టని ఖరీదులు. రెండొందలే మూలకి ! రోజులు గడిచిన కొద్దీ పిల్లలకి పొట్టెదుగుతుంది, బట్టెదుగుతుంది. జాగర్తసరోజమ్మా అని రోజూ గుంటూరు పిన్నిగారు చెప్పేవారు కదా ! మీకింకా ఇలా ఎన్ని ప్రాజెక్టలలవెన్సులొస్తే ఈ అమ్మ తల్లులంతా ఓ దార్లో పడతారు ? ఎంచక్కా బోల్డు సిగరెట్లు కాలుస్తార్ట. మతిలేని మాటలూ - కుర్రతనం చేష్టలూ !'' అని ఇంక తమలపాకు లివ్వడం మానేసి అమ్మ లేచ్చక్కా పోయింది నన్నొక్క సారయినా భలే పని చేశావని చూడకుండా !